# మారే సమాజం - మారని నీతులు

-బలివాడ కాంతారావు

**అక్కకు** ముగ్గురు ఆడపిల్లలున్నా సమస్య కానిది, తనకు ఒక్క కూతురే సమస్య ఎందుకైందన్న ప్రశ్నకు సమాధానం సీతాలక్ష్మికి ఈ నాటికీ తట్టలేదు.

కూతురు సురేఖ మంచం మీద నిద్రపోతోంది. అది మామూలు నిద్రకాదు. నిద్రమాత్రలు వేసుకుని తెచ్చుకున్న నిద్ర. సీతాలక్ష్మి దీపం ఆర్పి కిటికీ నించి చీకటిలో చుక్కల వేపు చూస్తోంది. చుక్కల్లో కన్నీటి బొట్లు రాలాయి కళ్ళలోంచి. తన కూతురికేం లేదు?

వడలని నవ్వులాంటి వదనం, కత్తిరించినా కవ్వించే జుత్తు, దవ్వుదవ్వులకు పరుగెత్తగలిగే శక్తి, కృతులు పాడలేకపోయినా కోకిలలా పలికే స్వరం, సాధన చేసి సాధించిన శరీరపు ఒంపులు, పొగడపూదండలాంటి పెనిమలు—

"నేనేం తక్కువ చేశాను?" అతని ఆశలన్నీ ఈ కూతురు పుట్టిన దగ్గరనించీ ఇంకొకరి మీద పెట్టుకోలేదు. ఒకే బిడ్డ ఒయ్యారంగా పెరుగుతుంటే ఏదీ దాని ఖర్మకు వదలలేదు. పూలతోటలో మొక్క తెచ్చి అపురూపంగా పెంచినట్టు పెంచారు. ఈ ప్రత్యేకత ఎంతవరకూ వెళ్ళిందంటే — తన కూతురు మామూలు స్కూల్లో చదవకూడదు. ఇంట్లో ఇంగ్లీషులోనే మాట్లాడాలి. కూతురుకు జడ వేసి జడ గంటలు వెయ్యాలన్న భార్య మోజునే కాదన్నాడు. ఎదిగినా చీర కట్టించడానికి వీల్లేదు. ఇంట్లో వండని తిండి వీధిలో ఖరీదైన హోటల్లో స్నేహితులతో తిని తిరిగి వస్తే మందలించకుండా "మనం మారుతున్నాం, పురోగమిస్తున్నాం" అని తండ్రి కూతురు పక్షం వహించాడు. జీన్సు వేసుకుని కారు స్టీరింగు పట్టుకుంటే విమానంలో వెళ్తున్నట్లు అనిపించేది. ఏ క్షణంలో ఏ మూడ్‌లో ఉంటుందో తెలియదు. ఇప్పుడు పకపక నవ్వి, మరో క్షణంలో చిరాకు పడి, ఇంకో క్షణంలో ఏడుస్తుంది. ఒక్కోసారి పట్టిన పట్టు విడువదు. ఒకోసారి ఏమన్నా తనకు కాదన్నట్లు పూరుకుంటుంది. ఏం చేసినా ఒక ఆలోచన లేదు. డబ్బు విలువ తెలీదు సరికదా కలుసుకున్న మనుషుల సంస్కారం కొలిచైనా వాళ్ళతో మెసలదు. గుడ్డిగా నమ్మేస్తుంది. అందుకే గోతిలో ఎవరో పడదోస్తే, బీటలు దేరిన గుండె పోటును భరించలేక నిద్రకోసం మాత్రలు మింగింది.

నిద్రలోనే కూతురు కేకవేసింది. ఆ కేకలో ఏదో బాధ. మీద చెయ్యి వేసినా కదల్లేదు. అతను ఇంత వేగిరం రాడు. ప్రయత్నించినా సీతాలక్ష్మికి నిద్ర రావటం లేదు. కలత జెందిన మనసు ఒక మనోహర స్వప్నం కోసం తహతహలాడుతోంది. భవిష్యత్తును పూలబాటగా సృష్టించి విహరిస్తానన్న ఆశ సన్నగిల్లడంతో, గడిచిపోయిన జీవితంలోని మనోహర దృశ్యాలను కళ్ళముందు సాక్షాత్కరింపజేసుకోడానికి ప్రయత్నించింది.

ఆహా అందాల మేడలో, అంతా పాశ్చాత్య పద్ధతిలో అలంకరించబడిన డ్రాయింగు రూములో కూర్చుంది. మెర్క్యురీ దీపపు కాంతిలో పూహించినా ఈ నాటి జీవితమే గోచరిస్తోంది. దీపం ఆర్పి డాబాలా నున్న పెద్ద బాల్కనీ లోనికి వెళ్ళింది. వీధి దీపాల కాంతి కళ్ళమీద పడగానే మళ్ళీ గదిలోనికి వచ్చి నేలమీద ఒరిగింది. కాశ్మీరు తివాసీ మీద దొర్లినా ఆకాశం గులాబీ రంగులో కనిపించినట్లుంది గానీ, నిజ రూపంతో జీవితం సాక్షాత్కరించలేదు. దేనికో దూరమైనట్లు, ఉప్పునీటితో చేరిపోయిన నదీ ప్రవాహంలా అనిపించి లేచిపోయింది. కిటికీలోనించి చూస్తే మళ్ళీ ఆకాశం, చుక్కలు, అక్కడక్కడా దుప్పటి పరచినట్లు పాలవెల్లి—సహజ వాతావరణంలో పడి ఆలోచనల కొక మార్గం దొరికినట్లనిపించింది.

అదే పల్లెటూరిలో తన చిన్నతనం...కొండవాగు నుంచి పారే తియ్యని నీరు తాగి గెంతిన లేడి లాంటి జీవితం. పాయసం తాగి, పెద్దల పాదసేవ చేసి బ్రతికిన తీరు. కాలం అంతా కవనం అల్లినట్లు కంట తడిపెట్టినా, అది అద్భుతమైన మనోల్లాసాన్ని అందిచ్చిన ఘడియలు. అరచేతులతో పెంచినా, అవసరమైతే శిరస్సు వంచి తర్వాత ఆ నమ్రత నించి మధుర భావాలను ఏర్చి కూర్చుకునే భాగ్యం.

బడిలో పాఠాలతోబాటు ఇంట్లో నేర్చుకున్న విద్య వినయ సంపదలను ఆర్జించి పెట్టింది. గౌన్లు వేసుకునే వయసులో చీర కట్టబెడితే, విప్పడానికి ఒప్పుకోక చేసిన మారాం తీరు—జడ గంటల మీద మక్కువ తీరిన రోజు దగ్గర కాగానే ఏమిటా అట్టహాసం! సన్నాయి స్వరంతో ఈ వార్తను పూరంతా ఎందుకు చాటుతున్నారు? అంతవరకు సిగ్గులోని రహస్యాలను తెలియని సీతాలక్ష్మి సిగ్గులో మునిగి ఆ చల్లదనంలో వచ్చిన ఆలోచనలతో నవ్వుకుంది. లంగా మీద జడ నిత్యం నూతనంగా అలంకరించుకునేది.

జీవితంలో మలుపులు తిరిగితే గానీ కొత్త బాటలో పడలేరట. ఆకుపచ్చని మొగలి రేకులు రంగులు మార్చుకున్నట్లు ఆ చెక్కిళ్ళు మెరవసాగినాయి. నెలవంక పెరిగి వెన్నెల విరజిమ్మినట్లు మొగలిరేకులు పండి సువాసనలు వెదజల్లినట్లు కూతురుంటే వాళ్ళ కింకేం బెంగ? పూర్లో తెలిసిన వార్త పూరు దాటి వెళ్ళిపోయింది. ఈ వార్తా ప్రసారం ఎందుకు జరిగిందో, అవసరమో సీతాలక్ష్మికి అప్పటికి గానీ అర్థం కాలేదు. వచ్చిన వాళ్ళు పుణ్య దంపతుల్లా ఉన్నారు. పార్వతీ పరమేశ్వరుల్లా ఉన్నారు. వయసు లోనూ, విజ్ఞానం లోనూ పెద్దవారు. నవ్వినా, మాట్లాడినా కదలినా వినయం, సంస్కారంతో ఉట్టిపడుతున్నారు. పిల్లను చూశారు. పిల్లను చూడక ముందే పిల్ల వెనక తరాల వారి సంప్రదాయాన్ని తెలుసుకొని మరీ వచ్చారు.

పెళ్ళికూతురు తల్లి "మా అమ్మాయికి సంసారం నడపడానికి కావలసిన అన్ని విద్యలూ నేర్పాను, మామ్మగారూ! కమ్మగా వండుతుంది. చక్కగా పాడుతుంది. మానధనం, మూలధనం ఎలా కాపాడుకుని మసలాలో తెలుసుకుంది. భావోద్రేకాలను అణచుకుని, బంధు ఆదరణలో ఆనందం పొందడం — ఇలా తల్లిగా నా వెంట త్రిప్పుకుని చెయ్యగలిగింది చేశాను. ఇక మీచేత పెడుతున్నాను. మీ ఇష్టం" అంది. "మా మనమడు శీనుకి తగ్గ ఇల్లాలు" అంది ముసలమ్మ.

పెళ్ళయి అత్తవారింటికి వచ్చాక వీళ్ళ అభిరుచులకు, తన కన్నవారి అభిరుచులకు అట్టే తేడా కనిపించలేదు. రెండూ చెరుకు తోటలే. వాళ్ళు ఆడుకునే ఆటలు వీళ్ళూ ఆడుకుంటున్నారు. వాళ్ళకున్న నమ్మకాలు వీళ్ళకూ ఉన్నాయి. ఇవన్నిటిలో ఆరితేరినట్లు ఇక్కడ సీతాలక్ష్మి మెసలగానే అందరి అభిమానాన్నీ చూరగొన్నది. ఒక విధంగా వీళ్ళందరిలో మేటి అనిపించుకుంది. బ్రతకడం ఒక ఆట. ఆటకు కొన్ని నియమా లుంటాయి. ఆ నియమాలు తెలుసుకోక పోతే ఆడలేం — బ్రతకలేం. చాకచక్యంతో బ్రతికితే మనచేత 'ట్రంప్‌కార్డ్' ఉన్నట్టే లెక్క.

భర్త ఉద్యోగ రీత్యా పెద్ద పట్టణాల్లో, అంతస్థులు ఎదిగి, అంతస్తుల్లో నివసించినా, సీతాలక్ష్మి తను పుట్టి పెరిగిన పల్లెలో నేర్చిన నియమాలు వదల్లేదు. జీవితంలో మలుపులు తిరిగినా త్రోవ తప్పలేదు. వచ్చిన త్రోవను మరిచి పోలేదు.

కూతురు నిద్రలోనే ఏదో గొణుక్కుంటూంది. ఇంతసేపు గతం ఆలోచించి ఆర్జించుకున్న హాయి అంతా కూతురివేపు మనసు మళ్ళి పొగానే పోయింది. అదేమిటో ఈ క్షణంలో ఈ కూతురు తన కూతురు కాదనిపించింది. తన జీవిత విధానంలో ఒక్క పాలైనా పంచుకోకుండా ఎక్కడో బ్రతికిన బిడ్డలా కనిపించింది. ఈ అమ్మాయి జీవిత విధానం వేరు. అలవాట్లు వేరు. అభిరుచులు వేరు. ఈ బిడ్డ గొంతుక వేరు.

"నేను మాట్లాడే భాషలో మాట్లాడదు. నా భావం ఈమె అర్థం చేసుకోదు. నాకు అపురూపమైన ప్రవర్తన ఈమెకు వెటకారంగా ఉంటుంది. నా అలవాట్లు, నా విలువలు, నా నమ్మకాలు, నా జీవిత గమ్యం ఈమెకు ఏవగింపు కలిగిస్తున్నాయి. నా కూతురైనా నా కన్నా భిన్నమైనది. ఇక్కడ నా

తోటలో పెరగలేదు. అక్కడ ఇంకో తోటలో నాటుకోలేదు. ఇక్కడా, అక్కడా చోటులేని దీనికి చోటెక్కడ?"

సీతాలక్ష్మికి అంతా అయోమయంగా కనిపించింది. ఏమీ తోచలేదు. ఏమీ చెయ్యలేనన్న నిస్పృహతో, దిగులుతో బాల్కనీలోనికి వెళ్ళింది. భర్త కారు కనిపిస్తుందేమోనని చూసింది. వీథంతా నిర్మానుష్యంగా ఉంది. కాళ్ళకి కొత్తగా తెచ్చిన పూలగోలెం తగిలింది. సిమ్లా నించి తెచ్చిన మొక్క భర్త అపురూపంగా తెచ్చి నాటాడు. ఈ సరికి చిగుర్లు పెట్టవలసిందే. చూద్దామని ఆత్రతతో లైటు వేసి పరీక్షగా చూసింది. పూర్తిగా ఎండిపోయి ఉంది.

"చలిదేశంలో బ్రతికే మొక్క ఈ ఎండల్లో ఎక్కడ బతుకుతుంది? ఏ ప్రాంతపు మొక్క ఆ ప్రాంతపు వాతావరణంలోనే బ్రతుకుతూ పెరుగుతుంది."

ఇంతలో కారు దీపాలు కనిపించాయి. కారు పార్కు చేసి శ్రీనివాసరావు పైకొచ్చాడు. ఆత్రతతో ఎదురు చూస్తున్న భార్యవేపు చూసి తాళాల గుత్తు సోఫామీద విసరేసి "అబ్బే — నాకేం తెలీదు అనేశాడు" అన్నాడు.

"అసలు విషయం చెప్పారా?"

"ఆ. మీ అమ్మాయిని పెళ్ళాడి ఎవరు భరించ గలరు అన్నాడు"

"అయితే అంత దగ్గరగా తిరిగా డెందుకు?"

"మీ అమ్మాయి ఎందరితోనో తిరిగింది. కావలిస్తే పేర్లు ఇస్తాను. వాళ్ళ దగ్గరకు వెళ్ళండి. నా దగ్గర కెందుకొస్తా వన్నాడు."

"అయితే ఇప్పుడేం చెయ్య దలిచారు?" సీతాలక్ష్మి కళ్ళలో నీళ్ళు ఉబుకుతున్నాయి.

"అమ్మాయికి తెలివి వచ్చాక అడిగి —ఒప్పుకుంటే ఆసుపత్రిలో చేరుస్తాను."

"ఆ పీక పిసికే పాపం— బాబోయ్—నే భరించ లేను. పిచ్చిదాన్నయి పోతాను."

"అంతలోనే ..."

కళ్ళంట నీరు కారిపోతున్నాయి. సీతాలక్ష్మి నిష్ఠురంగా "బిడ్డ పుట్టిన రోజునించీ చెప్తున్నాను. నేను కన్న తల్లి నండీ. ఆడపిల్లను పెంచే బాధ్యత నాదండీ—మీది కాదంటే విన్నారా? మీ పాశ్చాత్య చదువులూ, సంప్రదాయాలూ, వేష భాషలూ అన్నీ ఈ కూతురి మీద ప్రయోగించి చివరకు దాని బ్రతుకు ఎలా నాశనం చేశారో చూడండి."

భార్య ఆవేశం కాస్త తగ్గేవరకూ ఆగి, దీర్ఘంగా ఆలోచించి మాట్లాడినట్టు శ్రీనివాసరావు అన్నాడు: "దొరల సమాజం ప్రభావం మన సమాజం స్వీకరించింది కానీ, ఆసమాజపు నీతులను తిరస్కరించింది. ఆ ప్రభావంతో మారుతున్న మన సమాజాన్ని మారని మన నీతులతో చూస్తే పిచ్చెక్కి పోతాం. మారుతున్న సమాజానికి మారని నీతులు పనికిరావు. పాత నీతుల సంకెళ్ళ నుంచి విడిపించుకుని కొత్త నీతులను సృష్టించుకోవాలి. ఈ నాటి సమాజం అదురూ బెదురూ తిన్నట్టు ఇది వరకు మానవ సమాజం ఎప్పుడూ తినలేదు. ఈ షాక్‌ను తట్టుకోవాలంటే పాత నీతి మారాలి. నా కూతురి బ్రతుకు నాశనం



కాలేదు. ఎందుచేతనంటే ఆత్మహత్య చేసుకోకుండా ధైర్యంతో బ్రతికే ఉంది. ఈ షాక్ నించి బయట పడ్డాక కొత్త షాకును సునాయాసంగా తట్టుకో గలుగుతుంది. నీలా కన్నవారింట్లో నేర్చుకొని వచ్చి ఆడే బదులు ఇలా ఆడుతూ ఆడుతూ బ్రతికే చాకచక్యం నా కూతురు తనంతట తానే నేర్చుకుంటుందిలే! పద — నిద్రపో" అంటూ లేచి పడకగది వేపు కదిలాడు.

మారలేని సీతాలక్ష్మి అలా నిల్చుండిపోయి పిచ్చిగా చూసింది.

★